

టీడీపీలో అంతర్యుద్ధం



ఇప్పుడు కూటమే... నాడు ప్రత్యర్థే కదా... కొణతాలకు టికెట్ కేటాయింపుపై తెలుగు తమ్ముళ్లు గుర్రు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: టీడీపీ పార్టీలో అంతర్యుద్ధం జరుగుతుంది... పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీనే నమ్ముకుని కరుడుగట్టిన టీడీపీ కార్యకర్తలగా, నాయకులుగా ముద్ర వేసుకున్న వారి జాడ ప్రస్తుతం ఎక్కడా కనిపించలేదు. పొత్తులో భాగంగా జనసేన నుంచి టికెట్‌ను మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో ఆయనకు సహకరించడానికి ఏమాత్రం ఇష్టపడని తెలుగు తమ్ముళ్లలో అంతర్యుద్ధమే జరుగుతుంది. 30 ఏళ్లగా అధికార, ప్రతిపక్ష హోదాలో కొణతాలను ఎదుర్కొని, అనేక అవమానాలు, ఇబ్బందులు పడిన సంగతులను గుర్తు చేసుకుంటూ లోలోపల మదన పడుతున్నారు. గతంలో కొణతాల రామకృష్ణ టీడీపీలో చేరికపై తెలుగు తమ్ముళ్లు రోడ్డెక్కి ఆయనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన సంఘటన సైతం గుర్తు చేసుకుంటున్నారు. కొణతాలను పార్టీలో చేర్చుకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని టీడీపీ అధిష్టానానికి హెచ్చరికలు సైతం జారీ చేశారు. అలాంటిది నేడు అదే కొణతాల రామకృష్ణకు కూటమి అభ్యర్థిగా టికెట్ కేటాయించడంతో బహిరంగంగానే ఆందోళన చేసిన విషయం తెలిసిందే. పొత్తులో త్యాగాలు తప్పవు అని అధిష్టానం ఎంత చెప్పినా కొణతాల కాకుండా వేరే అభ్యర్థి అయితే సహకరించడానికి సిద్ధంగా ఉన్న తమ్ముళ్లు కొణతాల విషయంలో మాత్రం తగ్గేదేలే అంటున్నారు. ఆత్మీయ సమావేశాలు, ఉమ్మడి సమావేశాలు పేరుతో సమావేశాలు నిర్వహించిన కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అటుగా చూడకపోవడం విశేషం. పార్టీలోకి వస్తా మంటేనే అడ్డుకున్న మేము కూటమి అభ్యర్థి అయితే ఎలా సహకరిస్తామంటూ మండిపడుతున్నారు. అదిష్ఠానం ఆదేశాల మేరకు కొణతాలకు సహకరిస్తామని బయటకు చెబుతూ, కొణతాల పక్కనే ఉంటున్న టీడీపీ నాయకులు లోపల మాత్రం అసంతృప్తితో రగలిపోతున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి. సమన్వయంతో సర్దుకొని సహకరిస్తారో..కూటమి అభ్యర్థే అయిన ఎప్పటికి ప్రత్యర్థే అనుకుంటారో వేచిచూడాలి..

వాలంటీర్లతో కార్పొరేటర్ రహస్య సమావేశం

- షాకిచ్చిన జనసేన, టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 77వ వార్డు వాలంటీర్ల సమావేశాన్ని అత్యంత రహస్యంగా కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఇంట్లో నిర్వహిం చేందుకు చేసిన యత్నాన్ని జనసైనికులు, టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. 77వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న బట్టు సూర్యకుమారి తన వార్డులోని వాలంటీర్ల సమావేశాన్ని సచివాలయ వార్డు కన్వీనర్ సహాయంతో శుక్రవారం తన ఇంట్లో అత్యంత రహస్యంగా నిర్వహించారు. ఇక్కడ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ వార్డు వాలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న స్థానిక జనసైనికులు, టీడీపీ నాయకులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సకాలంలో స్పందించక పోవడంతో పాటు ఫోటోలు లాంటి ప్రూఫ్ కావాలని అడగడంతో ఇరుపార్టీల నాయకులు స్వయంగా వెళ్లి సమావేశంకి సంబంధించి ఫోటోలు వీడియోలు చిత్రీకరించ బోయారు. ఇంతలో అక్కడున్న వైసీపీ నాయకులు వెంటనే జనసేన, టీడీపీ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. వారిని నెట్టి సెల్ ఫోన్‌లు లాక్కునే ప్రయత్నాలు చేశారు. ఓ అరగంట పాటు కాస్త వాగ్వివాదం జరిగింది. ఇంతలో సీఐ బాలసూర్యారావు రావడంతో వైసీపీ నాయ కులు అక్కడ నుంచి ఎవరికి వారు జారుకున్నారు. ఇదే తరహాలో వాలంటీర్లు కూడా వేర్వేరు మార్గాల గూండా అక్కడ నుండి జారుకు న్నారు. మొత్తానికి బట్టు సూర్యకుమారి 79వ వార్డు దేశపాత్రుని పాలెంలో వాలంటీర్లతో సమావేశం నిర్వహించడం పెద్ద వివాదానికి కారణమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేయునున్నట్లు జనసేన, టీడీపీ నాయకులు తెలిపారు. ఇదిలా ఉంటే వాస్తవానికి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సందర్భంగా వందలాది మందితో సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఎటువంటి అనుమతులు లేకుండా దేశపాత్రునిపాలెంలోని కార్పొరేటర్ సూర్యకుమారి నిర్వహించిన

సమావేశంపై ఎన్నికల సంఘానికి నివేదించనున్నట్టు జనసైనికులు, టీడీపీ నాయకులు చెప్పారు. పెదగంట్యాడ మండల పరిధిలో 77వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేటర్ పరవాడ మండలంలో వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయాల్సిన అగత్యము ఏమిటని టీడీపీ జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - ఎలమంచిలి: ఈనెల 23వ తేదీన అనకాపల్లి రోటరీ క్లబ్‌లో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర సమితి సభ్యులు జి.ఏసుదాసు కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు, జిల్లా కార్మిక నాయకులు హాజరవు తారని, ఈ మహాసభల్లో కార్మిక సమస్యలు, ఉద్యోగ సంఘా లు సమస్యలపై పోరాటాలు వంటి వాటిపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మం దలాల కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా ప్రధాన కేంద్రం రోటరీ ఫంక్షన్ హాలులో ఈ నెల 23వ తేదిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో

జరగనున్న ప్రథమ మహా సభను జయప్రదం చేయడానికి రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని దేవరాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు దుక్కా ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సంఘం కార్మికుల కార్యదర్శి రాయి సింహాద్రి, గరికిన రాజు, పుల్లారావు, నెంబరు సూరిబాబు, గణేష్, పెంటయ్య, చల్లా రమణ, గోకాడ అప్పారావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిగా పైలా ఎంపిక పట్ల హర్షం

విశాలాంధ్ర - చీడికాడ: మాడుగుల నియోజకవర్గం టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పైలా ప్రసాదరావును ఎంపిక చేయడం పట్ల మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ఖండివరం గ్రామం నుండి 25 మంది కార్యకర్తలు, నాయకులు వెళ్లి ప్రసాదరావును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ వంటి వాటిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. టీడీపీ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ నాయుడు, జురెడ్డి అప్పారావు, గుళ్లిపల్లి వరాహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరగాలి

కలెక్టరు రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి శతశాతం అమలు పరచాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఎక్కడా ఉల్లంఘనలకు అవకాశమీయరాదన్నారు. అనుక్షణం అప్రమత్తంగా వుండాల న్నారు. 9 చెక్ పోస్టుల వద్ద తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహిచాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ టీమ్‌లు, వీడియో వీవింగ్ మొదలైన వారు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నియమావళి పరిశీలన, అమలు అధికారులు నిశితంగా గమనిస్తూ వుండా లన్నారు. తమ శాఖల పనులను చేస్తూ ఎన్నికల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు గూర్చి అన్నిజిల్లాల ఎన్నికల అధికారులతో సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-7,8లను ఈనెల 26 నాటికల్లా పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశం చారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, అనుమతుల జారీని వేగవంతం చేయడం, సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్ట్రానిక్ సీజన్ మేనేజ్మెంట్ సిస్టం పటిష్టంగా అమలు పరచడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలె క్టర్ బి.స్మరణ్ రాజ్, డి.ఆర్.ఓ. బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్ని కృష్ణ, హెచ్.వి.జయరామ్, డీఎం అండ్ హెచ్ వో డాక్టర్ ఎ.హేమంత్, గ్రామ వార్డు ప్రత్యేకాధికారి మంజులవాణి, ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఆర్టీవో ప్రకాశరావు పాల్గొన్నారు.

ఓటర్లకు చీరలు ఎర

ఫ్లయింగ్ స్క్వాడ్‌కు దొరికిన ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ భార్య

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో ఓటర్లకు గాలం వేసేందుకు చీరలు, ఇతర తాయిలాలు పంచు తున్న అధికార వైసీపీ తాజా మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ భార్య, జెడ్.పి.టి.సి భర్త మారిశెట్టి శ్రీకాంత్‌లు శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అడ్డంగా దొరికిపోయారు. చోడవరంలో ఓటర్లకు పంచడానికి వైసీపీ జెడ్పీటీసీ భర్త శ్రీకాంత్ కారులో తీసుకెళుతున్న చీరలను ఎన్నికల అధికారులు పట్టుకున్నారు. వారిలో స్వయాన చోడవరం ఎమ్మెల్యే ధర్మ శ్రీ భార్యతో పాటు పలువురు వైసీపీ ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు వున్నారు. ఓటర్లకు గాలం వేసేందుకు మొదలైన వైసీపీ తాయిలాల పర్వంను ఎన్నికల అధికారులు బ్రేక్ వేశారు. స్వయాన ఎమ్మెల్యే ధర్మ శ్రీ భార్య కూడా ఘటనా స్థలంలో ఉండటంతో అధికారులు ఆవిడ పేరును తప్పించడానికి ప్రయత్నిస్తున్నారంటూ, టీడీపీ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై తక్షణమే ఓటర్లను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తూ అడ్డుగోలుగా పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా వివిధ ప్రజా మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - కోటవురట్ల: రాష్ట్రంలో యువత, మహిళలు, రైతులు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అభివృద్ధి సువర్ణ పాలన అందాలంటే చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని పాయకరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం మండలంలో అన్నవరం గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి మహిళలు, యువత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి అన్ని వర్గాల ప్రజలను జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని ప్రజలు ఆమె వద్ద వాపోయారు. చంద్రబాబు మళ్ళీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే మా బ్రతుకులు బాగుపడతాయని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, జనార్ధన్, నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రవణమ్మ, లింగం నాయుడు, భాస్కరరావు, సుంకర బాబ్జి, తిరుమలరావు, చంటి, బోడపాలెం సత్తిబాబు, కోటి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీను, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కనకరాజు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా దాసరి అచ్యుతరావు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా వీరనారాయణం గ్రామానికి చెందిన దాసరి అచ్యుతరావు నియమితు లయ్యారు. మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కోపరేటివ్ మాజీ అధ్యక్షులు దాసరి నానిబాబు కుటుంబం మొదటి నుండి రాజకీయ కుటుంబం కావడంతో దాసరి అచ్యుతరావును మాడుగుల మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబుకి మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణకి, మండల అధ్యక్షుడు గద్రెడ్డి శివాజీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

నిరుపయోగంగా ఏషియన్ పెయింట్స్ మరుగుదొడ్లు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభించి నెలలు గడుస్తున్న నేటికీ ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో సామాజిక మరుగుదొడ్ల ముందే కొంతమంది బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతాలు క్రిమి కీటకాలతో పాటు దోమలకు నిలయంగా మారాయి. పక్కనే అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. పరిసర ప్రాంతాలలో దుర్గంధ భరితమైన వాసన

రావడంతో అంగన్వాడీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో పూడిమడకలో రెండు చోట్ల ప్రజల సౌకర్యార్థం సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. రెండు చోట్ల నిర్వహణ చేపట్టక నిరుపయోగంగా ఉండడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని మహిళలు తదితరులు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయ ఢంకా మోగించే విధంగా ప్రతి ఒక్కరు నడుం బిగించాలని మాడుగుల నియోజక వర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. గురువారం కె.కోటపాడు మండల కేంద్రం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలతో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి ఆ పథకాల యొక్క ప్రాముఖ్యతను పూర్తిస్థాయిలో వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రొంగలి మహేష్, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామానాయుడు, పూడి నారాయణమూర్తి, లెక్కల అవతారం, క్లస్టర్ ఇన్చార్జి లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, యూనిట్ ఇన్చార్జిలు రాళ్లపల్లి శ్రీరామమూర్తి, ఎడ్ల రమేష్, పూడి నారాయణమూర్తి, మొల్లి గోవింద, లెక్కల చంద్రరావు, లెక్కల అప్పలనాయుడు, దొగ్గ వరాహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారులకి కోచింగ్ క్యాంప్

విశాలంధ్ర - అచ్యుతాపురం: రగ్బీ జాతీయ స్థాయి క్రీడాకారులకి మూడు రోజులు కోచింగ్ క్యాంప్‌ను అచ్యుతాపురంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు అన్నారు. శనివారం మూడు రోజులు కోచింగ్ క్యాంప్‌ను సర్పంచ్ ప్రారంభించారు. ఈనెల 25 నుంచి 30 వరకు ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగబోతున్న రగ్బీ 15కు ఆంధ్ర రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు అచ్యుతాపురంలో మూడు రోజులు శిక్షణ పొంది 24వ తేదీన భువనేశ్వర్ వెళ్తారని నిర్వాహకులు కూండ్రపు వెంకట్ తెలిపారు. గుంటూరుకు చెందిన సుమంత్ టీంకి కోచ్‌గా విశాఖపట్నంకి చెందిన వెంకట్ వ్యవహరిస్తున్నారని రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెక్రెటరీ రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు హాస్పిటల్ డాక్టర్ అడిగర్ల సుధీర్, సన్ రైస్ డయాగ్నొస్టిక్ సోమశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

వేడుకగా ఆలయ ప్రారంభోత్సవ ముహూర్తపు రాట

విశాలాంధ్ర - పరవాడ: రావాడ పంచాయతీ పరిధి జల్లెల పాలెం గ్రామంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి నూతన ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముహూర్తపు రాట మహోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. పూజారులు మేడిశెట్టి అప్పలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు జరిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, సభ్యులు మేడిశెట్టి సోము నాయుడు, పితాని అప్పారావు, కట్టా ఆది నారాయణ, పోలవరపు గంగునాయుడు, దొడ్డి కృష్ణారావు, పోలవరపు నాగరాజు, పితాని శ్రీను పాల్గొన్నారు.

7 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - పరవాడ: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై పరవాడ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.బాల సూర్యారావు తెలిపిన వివరాల ప్రకారం.. మంత్రిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి రమణ అనే వ్యక్తి మద్యం దుకాణం నుండి మద్యం కొనుగోలు చేసి అమ్మేందుకు తీసుకు వెళు తుండగా మార్గం మధ్యలో ఎస్ఐ మల్లేశ్వరరావు తనిఖీలు చేసారు. ఇందులో అతను రూ.1071 విలువ గల 7మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. దీంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వ్యాసరచన ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి.శ్రీనివాస్, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఈశ్వరరావు, ప్రస్తుత జిల్లా కోశాధికారి ఎస్.నాగ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు దేశ స్వతంత్ర ఉద్యమంలో యువతను, ప్రజలను భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. బ్రిటీష్ వలస పాలన నుంచి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడారన్నారు. శనివారం అనకాపల్లి దొడ్డి రామానాయుడు భవన్‌లో వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, ఆ సభలో మొదట, ద్వితీయ, తృతీయ బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

డ్రగ్స్‌కి అడ్డాగా విశాఖను మార్చేశారు: భీశెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలో విశాఖపట్నం తనకి కలల రాజధానని చెపుతున్న ప్రతిసారి విశాఖపట్నంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ దొరుకుతున్నాయని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఎద్దేవా చేశారు. శుక్రవారం అనకాపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం బ్రెజిల్ నుండి విశాఖపట్నం పోర్టుకి ఓ ప్రైవేటు ఆక్వా ఎక్సపోర్టుకి తరలించిన డ్రైడ్ ఈస్ట్ కంటైనర్‌లో సుమారు 25 వేల కిలోల మాదక ద్రవ్యాలను సీబీఐ ఇంటర్ పోల్ సమాచారం మేరకు డ్రగ్స్ పట్టుకోవడం సంచలనంగా ఉందని ఈ వార్త తెలిసి దేశమంతా ఉలిక్కిపడిందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఉత్తరాంధ్రలో అంతులేని గంజాయి అమ్మకాలు, మద్యం అమ్మకాలు పెరిగిపోయాయన్నారు. దొరికిన కంటైనర్‌లో ఒక్కో బ్యాగ్‌లో 25 కేజీల చొప్పున 1000 బ్యాగులు అంటే 25 వేల కేజీల మాదకద్రవ్యాల ఖరీదు సుమారు లక్ష కోట్లు రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారని అన్నారు. సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కొలసాని రమణ, రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

విశాలాంధ్ర - చీడికాడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున 175 నియోజ కవర్గాలలోనూ 175 మంది అభ్యర్థులు పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. పదిహేను వందల మంది ఇప్పటికే టిక్కెట్లు కొరకు దరఖా స్తులు చేసుకున్నారని వాటిని పరిశీలించి గెలుపు గుర్రాలకు టికెట్ కేటాయిస్తారన్నారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్ని జిల్లాలలో పర్యటించి ప్రణాళిక బద్ధంగా పార్టీని అభివృద్ధి చేశారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి పోచారం రాకేష్ రెడ్డి జిల్లాలోని నియోజవర్గాలు తిరిగి పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చారన్నారు.

కేజీబీవీని డీఈఓ తనిఖీ

విశాలాంధ్ర - నక్కపల్లి: స్థానిక కేజీబీవీ పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడమే కాకుండా చిన్నారులందరూ మంచి క్రమశిక్షణగా ఉండడం చూసి ప్రిన్సిపాల్ సలీమ్, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగలక్ష్మిలను ప్రశంసించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినీల వద్దకు వెళ్ళి పరీక్షలు జరుగుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఆవరణలో కోడ్ అమలు ఖచ్చితంగా పాటించాలని ఆమె పేర్కొన్నారు.

పైడిపాలలో శంఖారావం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలం పైడిపాల గ్రామంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు శుక్రవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కమిటీ నాయకులు సిద్దభత్తుల రమణ (శ్రీను) టీడీపీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్‌లు లగుడు వెంకటరమణ, కింతాడ రమణ, టీడీపీ నాయకులు లాలం కృష్ణ, లాలం వామన్న, ఆదారి గోవింద, లగుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

గిడుతూరులో ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని గిడుతూరులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 354 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ గ్రామంలో రెండో విడతగా శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 354 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి, రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సీతారామలక్ష్మి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి 20వేల విరాళం అందించిన రాయపురెడ్డి కృష్ణ

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగుల మండల ఎం.కోడూరు గ్రామంలో గల శ్రీ దుర్గాలమ్మ తల్లి ఆలయానికి మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ 20వేల విరాళంగా గ్రామ ఆలయ కమిటీ సభ్యులు రావల శివ, బుచ్చిబాబుకి అందించారు . అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రాయపురెడ్డి కృష్ణను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల జనసేన నాయకులు గట్ట రామారావు, మాడుగుల మండల యువజన అధ్యక్షులు పడాల చాణిక్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్ రాజధానిగా చేస్తున్న వైసిపి

బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర-బ్యూరో-అనకాపల్లి: వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా జరుగుతుందని కేంద్ర నిఘా వర్గాలు గతంలోనే చెప్పారని, మరలా ఇప్పుడు విశాఖ సిపి విశాఖ నుండి గంజాయి రవాణా జరుగుతుందని తేటతెల్లం చేశారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు. పార్లమెంట్ కార్యాలయంలో పట్టణ శాఖ ముఖ్య నాయకులతో మాట్లాడుతూ. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జగన్ ముఠా పాపాల పుట్ట ఒక్కొక్కటిగా బద్దలవుతోందని,ఇక ఎలాగూ అధికారంలోకి రావడం అసాధ్యమని తేలిపోవడంతో ఆఖరి గడియల్లో వైసిపి చీకటి మాఫియాలు జాక్ పాట్ లు కొట్టే పనిలో నిమగ్నమయ్యాయని, నిన్న విశాఖ తీరంలో బ్రెజిల్ నుంచి తరలిస్తున్న 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడ్డాయన్న వార్త విశాఖ అనకాపల్లి జిల్లాలో ప్రజలను కలవరపరిచిందని, విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీ పేరుతో ఈ డ్రగ్స్ దిగుమతి చేసుకున్నాయంటే జె-గ్యాంగ్ ఎంత బరితెగిస్తుందో అర్థం చేసుకోవచ్చు నాగ జగదీష్ అన్నారు.ఈ భారీ డ్రగ్స్ మాఫియాకు కేరాఫ్ అడ్రస్ నూటికి నూరుపాళ్లు తాడేపల్లి ప్యాలెస్, గతంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి బినామీకి చెందిన ఓ డబ్బా కంపెనీ (ఆషీ ట్రేడింగ్ కంపెనీ, విజయవాడ) పేరుతో వచ్చిన 21వేల కోట్ల విలువైన డ్రగ్స్ ను ముంద్రా పోర్టులో స్వాధీనం చేసుకోగా, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే,తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లోనే డ్రగ్స్, గంజాయి మాఫియాలు చెలరేగిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ ఎప్పటినుంచో ఆందోళన చేస్తూ వస్తోందని,ఈ చీకటి వ్యవహారాలను బయటపెట్టామన్న అక్కసుతోనే గతంలో వైసిపి మూకలు టిడిపి కేంద్ర కార్యాలయంపై కూడా దాడికి తెగబడ్డాయని నాగ జగదీష్ అన్నారు. విశాఖను రాజధాని చేయడం దేవుడెరుగు డ్రగ్స్ క్యాపిటల్ గా మార్చావు కదా జగన్ రెడ్డి, యువకుతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకపోగా చెడుదారులకు వెళ్లే విధంగా గంజాయి , కొక్కేన్ వంటి డ్రగ్స్ ని సరఫరా చేసి యువతను చెడు మార్గంలోకి వెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నారని ఇటువంటి నీచమైన పనులకు పాల్పడుతున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపే విధంగా ప్రజలు తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి పార్టీకి ఓట్లు వేసి వైసీపీని సాగనంపాలని ఓటర్లకు నాగ జగదీష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కే కే వి ఏ నారాయణరావు కోట్ని రామకృష్ణ బోడి వెంకటరావు కుప్పిలి జగన్ మల్ల గణేష్ గుడాల సత్యనారాయణ జంప మల్లికార్జునరావు బొడ్డేడ మురళి పొలిమేర నాయుడు దూలం ప్రసాద్ విల్లూరి రమణబాబు కాండ్రేగుల సత్యనారాయణ సాలపు నాయుడు కొయిలాడ గణేష్ పట్నాల నరసింహమూర్తి పిల్లా తారకేశ్వరరావు కొమ్మర్తి నారాయణ కొణతాల బాల బుద్ధ ఈశ్వరరావు ఆకేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

31

దివ్యాంగ విద్యార్థుల ఉచిత ఉపకరణాలకు గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: స్థానిక జీ.వీ.ఎం.సీ వుడ్ పేట ప్రైమరీ పాఠశాల ఆవరణలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు అల్మికో సంస్థ వారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో చదువుతున్న 0 నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణములు (వీల్ చైర్లు, సిపి చైర్లు, ట్రై సైకిల్స్, క్లచెస్, వాకర్స్ , రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్, వినికిడి యంత్రాలు) ఇవ్వటానికి గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరమును నిర్వహించారు. ఈ గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరంను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శ్రీమతి బి. శకుంతల , మండల విద్యాశాఖ అధికారి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఉపకరణాలు పొందడం కొరకు సుమారుగా పది మండలాల నుండి 107 మంది దివ్యాంగ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి కంటి, చెవి ముక్కు గొంతు ఆర్థోపెడిక్ డాక్టర్లు వై గంగాధర్-ఆర్థోపెడి షియన్, డాక్టర్ ఫరుద్దీన్-ఈ ఎన్టి స్పెషలిస్ట్, డాక్టర్ దివ్య ప్రియ-ఆప్తమాలజిస్ట్ హాజరయ్యి విద్యార్థులకు కావలసిన ఉపకరణాలను సిఫారసు చేయడం జరిగింది. చికిత్స నిమిత్తం అవసరమగు సూచనలను డాక్టర్లు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వుడ్ పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస రావు, అనకాపల్లి మండల ప్రత్యేక ఉపాధ్యాయులు బి.వి. వరప్రసాద్ ,రమాదేవి, యేసు రత్నం పది మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నుండి వైసీపీలోకి 100 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-గొలుగొండ: ఐదు సార్లు వివిధ శాఖల మంత్రిగా చేసిన అయ్యన్న పాత్రుడు చేసిన అభివృద్ధి ఏంటో ఒక్కసారి ఎమ్మెల్యేగా నా హయంలో చేసిన అభివృద్ధి ఏమిటో చర్చించేందుకు సిద్ధమా అంటూ నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ బహిరంగ సవాల్ విసిరారు. శుక్రవారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ అయినా ఏఎల్ పురంలో తెలుగుదేశం పార్టీ నుండి వైసీపీలోకి ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో 100 కుటుంబాలు చేరడంతో వారందరికీ వైసిపి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గం ఎవరి హయంలో అభివృద్ధి జరిగిందో చర్చించేందుకు చర్చకు సిద్ధమని ఆయన అన్నారు నర్సీపట్నంలో 150 పడకల ఆసుపత్రిను తీసుకువచ్చానని చెప్పుకునే అయ్యన్న పాత్రుడు మాకవరపాలెం మండలంలో నేను తీసుకొచ్చిన మెడికల్ కాలేజీ నిర్మాణం కనిపించలేదా అని ప్రశ్నించారు దేశంలోనే అన్ని రాష్ట్రాలు ముఖ్యమంత్రిలు మేచ్చే విధంగా సచివాలయ వ్యవస్థ వాలంటరీ వ్యవస్థ తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు నర్సీపట్నంలో టిట్కో ఇల్లు నిర్మాణంలో గత ప్రభుత్వ హయాంలో 30 కోట్లతో నిర్మించి అందులో 10 కోట్లతో కాంట్రాక్టర్ను బెదిరించి తన సొంత ఇల్లు నిర్మాణం చేసుకున్న అయ్యన్నపాత్రుడు అని అన్నారు తన హయాంలో 90 కోట్ల రూపాయలతో టిట్కో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకి ఇవ్వడం జరిగిందన్నారు ఎదుటి వ్యక్తులపై విమర్శలు చేసే ముందు తమ పరిస్థితి ఏంటో ఒకసారి అర్థం చేసుకోవాలని ఇంట్లో మరుగుజ్జు లాంటి అయ్యన్న పాత్రుడు పెద్ద కొడుకు ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని పొట్టి వాడు అని సంబోధిస్తూ ఉంటారని అది ఎంతవరకు సమన్యసం అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు ఏ ఎల్ పురం సర్పంచ్ అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత జడ్పిటిసి వెంకటగిరి బాబు నాయుడు ఎంపీపీ గజ్జలపు మణికుమారి వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి సుర్ల ఆదినారాయణ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ఎంపీటీసీలు చింతల బుల్లి ప్రసాద్ మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించాలి

విశాలాంధ్ర -మాకవరపాలెం: ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో చంద్ర రావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జి.గంగవరంలోని రాయపురాజు చెరువులో జరుగుతున్న పూడిక తొల గింపు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది కూడా కూలీలకు 100 రోజులు పనికల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి బుచ్చినాయుడు ఆకస్మికమృతి

విశాలాంధ్ర-గంట్యాడ: విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేయు చున్న కాంట్రాక్ట్ ఉద్యోగి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యమ నేత ముఖ్యంగా 12 07 జీవో ప్రకారంగా ఉద్యోగులను క్రమబద్ధీకరించుటలో అహర్నిశలు శ్రమించి పోరాడి ఉద్యమఫలాన్ని అర్హులైన వారందరికీ అందించిన గొప్ప ఉద్యమ నేత, నిస్వార్థపరుడు బుధవారం రాత్రి గుండుపోటుతో అకాలమరణం చెందుట శాఖ ఉద్యోగులను ఎంతో బాధ కలిగించింది. మంత్రిబొత్స సత్యనారాయణ చొరవతో ఉద్యోగుల సమస్యలపై పోరాడి ఘనవిజయం సాధించట లో ఆయన సేవలు ఎనలేనివి గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందిన బుచ్చినాయుడు స్వస్థలం గంట్యాడ మండలం పేది మధ్యపాలెం గ్రామానికి చెందిన ఉద్యోగి ఈయన ప్రస్తుతం గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నారువారి ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఉద్యోగులు మురళి నారాయణ రామకృష్ణ శ్రీరాముల నాయుడు రమణ అబద్ధం పద్మ రమణారెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు.

నూతన విద్యా విధానాలను రూపొందించాలి

శ్రీరాం విద్యాపీట్ ప్రెసిడెంట్ ప్రమీల షరాఫ్

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక శ్రీ దుర్గా ప్రసాద్ షరాఫ్ అటానమస్ (ఎస్ డి ఎస్) కళాశాలలో శుక్రవారం శ్రీరాం విద్యాపీట్ ప్రెసిడెంట్ ప్రమీల షరాఫ్ వైస్ ప్రెసిడెంట్ అర్ నౌ షరాఫ్ ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశంను ఏర్పాటు జరిగింది. కార్యక్రమంలో కెవిఎస్ఎన్ మూర్తి సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ బలిజేపల్లి రవి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రమీల షరాఫ్ అర్ నౌ షరాఫ్ మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంది అని శ్రీరాం విద్యాపీట్ సంస్థను అభివృద్ధి పదంలో నడిపించేందుకు విద్యార్థిని విద్యార్థులకు అత్యున్నతమైన విలువలతో కూడిన విద్యను అందించి అన్ని రకముల వసతులు కల్పించాలన్నారు.నూతన విద్యా విధానాలను తీసుకురావాలని ఎన్‌సిసి తో విద్యార్థులను మానసిక ఒత్తిడిని దూరంచేసి మానసిక ఉల్లాసంను పెంపొందించాలన్నారు. ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ ను ఏర్పాటు చేసి దివ్యాం గుల భవిష్యత్ ను అద్భుతంగా తీర్చిదిద్దుటకు ఎవరి సహాయం లేకుండా వారి కాళ్ల మీద వారు నేటి సమాజంలో నిలబడుటకు వారిలో ధైర్యం ఆత్మ విశ్వాసంను కలుగజేసి ఉచిత వసతివిద్యను అందించి అనేక సేవలు అందిస్తున్నామన్నారు. గోదావరి దేవి షరాఫ్ ఇంగ్లీష్ మీడియం 10వ తరగతి పాఠశాలను సీనియర్ సెకండరీ పాఠశాలగా మార్పులు తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో గోదావరి దేవి షరఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ బలిజేపల్లి రవిని అభినందించి శ్రీరాం విద్యాపీట్ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలన్నారు.

నాయకులు, కార్యకర్తల విలువైన సూచనలతో ముందుకు...

- గతం కంటే ఎక్కువ మెజార్టీతో విజయం
- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: నాయకులు, కార్యకర్తల విలువైన సూచనలు,సహకారంతో ఎన్నికల ప్రచారంతో ముందుకు సాగుతున్నామని గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధించి తీరుతామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.తన కుటుంబం పూర్వం నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికి నాకు రాజకీయాలు కొత్త అని అన్నారు. అయినప్పటికి నాయకులు,కార్యకర్తలు అక్కున చేర్చుకొని అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.అందరి సహకారం, సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.ఇప్పటికు గడపగడపకు తిరుగుతు ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినట్లు తెలిపారు. ప్రతి గడపలో తనకు అపూర్వస్వాగతం పలుకుతున్నారని ప్రభుత్వం వలన పోందిన లబ్ధిని చెప్పుతూ ఆనందంగా వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

టిడిపి-జనసేన నుంచి 100 మంది వైసిపిలో చేరిక....

నియోజకవర్గం పరిధిలో సుందరయ్యపేట గ్రామానికి చెందిన వందమంది టి డి వి , జన సేన కార్య కర్తలు వైసిపి లోకి చేరారు.పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.రానున్న రోజుల్లో మరింతగా చేరికలు ఉంటాయని తెలిపారు.కార్యక్రమాల్లో దంతులూరి దిలిప్‌కుమార్, మళ్ల బుల్లిబాబు,గొర్లి సూరిబాబు,మలసాల కిషోర్, జాజుల రమేష్,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు, పౌష్టికాహారంతో పోషకాహార లోపం మాయం

విశాలాంధ్ర - వంగర: మండలంలో పోషకాహార పక్షోత్స వాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వంగర సెక్టార్ పరిధిలోగల నీలయ్యవలస అంగన్వాడీ సెంటర్‌లో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా గర్భిణీ బాలింతలకు, తల్లులకు పోషకాహారం లో భాగంగా చిరుధాన్యాలు, పౌష్టికాహారలోపప్రాముఖ్యతను అంగన్వాడీ వంగర సెక్టార్ సూపర్ వై జర్ రజనీ దుర్గ వివరించారు.మిల్లెట్లు సూపర్ ఫుడ్స్, వీటిని చిరుధాన్యాలు అంటారని వివరించారు. జొన్న, రాగి, బార్లీ మొదలైనవనీ,వీటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణీలు, బాలింతలకువివరించారు.చిరుధాన్యాల్లో కాల్షియం, ఐరన్, జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్, విటమిన్-బి-6, 3, కెరోటిన్, లెసిథిన్ మొదలైన మూలకాలుఉంటాయన్నారు. వీటిని తినడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుందన్నారు.చిరుధాన్యాలు శరీరంలో ఉండే ఎసిడిటీని అంటే యాసిడ్‌ను తొలగిస్తుందనీ,ఎసిడిటీ వల్ల చాలా నష్టాలు ఉన్నాయని తెలిపారు.చిరుధాన్యాల్లో ఉండే విటమిన్-బి3 శరీరం జీవక్రియ ప్రక్రియను సరిగ్గా ఉంచుతుందని చెప్పారు. చిరుధాన్యాలు టైప్-1, టైప్-2 డయాబెటిస్‌ను నివారించగలవని వివరించారు.ఉబ్బసం వ్యాధికి చిరుధాన్యాలు మేలుచేస్తుంది. వీటిని తినడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులన్నీ నయమవుతాయన్నారు.అంతేకాకుండా థైరాయిడ్, యూరిక్ యాసిడ్, మూత్రపిండాలు, కాలేయం వ్యాధులు, ప్యాంక్రియాటిక్ సంబంధిత వ్యాధులను అడ్డుకుంటుందన్నారు. ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. శరీరంలోని ఫ్రీరాడికల్స్ ప్రభావాలనుతగ్గించే యాంటీఆక్సిడెంట్ మూలకాలను కలిగి ఉంటుందనివివరించారు. వీటిలోని కెరాటిన్ ప్రోటీన్ కాల్షియం, ఐరన్, జింక్ జుట్టు సంబంధిత సమస్యలను తొలగిస్తుందన్నారు. అదేవిదంగా మూడు నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆకుకూరలు కూరగాయలు చిరుధాన్యాలు వంటి పదార్థాలను తీసుకోవాలని సూచించారుజ గర్భవతి నుండి రెండు సంవత్సరాలు పిల్లలకు వారి పోషణ పౌష్టికాహార ప్రాముఖ్యత గురించిఅంగన్వాడీ టీచర్స్ కి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కుమారి, మినా, వెంకటలక్ష్మి, వంగర సెక్టార్ అంగన్వాడీ లు తదితరులు పాల్గోన్నారు.

అభివృద్ధిని చూసి మరోసారి తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి

కోలగట్ల వీరభద్రస్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలో చేసిన అభివృద్ధి, నీతివంతమైన పాలన చూసి మరోసారి తనను శాసనసభ్యునిగా ఎన్నుకోవాలని కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలను కోరారు. శుక్రవారం 5వ డివిజన్ బాబా మెట్టలోని ద్వారకా నగర్ నుండి ప్రారంభించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన కోలగట్ల అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, నగరంలో తాను చేసిన అభివృద్ధి, అందుబాటులో ఉండడం, అవినీతి లేకుండా పాలన సాగించడం, కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి మరోసారి శాసనసభ్యుడిగా తనను గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. సంక్షేమ నిధులు నేరుగా ప్రజల ఖాతాల్లోకే వేసిన వైనం దేశంలో మరెక్కడా లేదన్నారు. నియోజకవర్గ పరిధిలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత తమదేనని అన్నారు. ఈ విషయంలో రూపాయి కూడా లంచానికి తావు లేకుండా అవినీతి రహితంగా అందజేసామని అన్నారు. కానీ దురదృష్టవశాత్తు ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆడిన మాటకు విలువ ఉండాలంటే ముందు మాట్లాడే మనిషికి విలువ ఉండాలని అన్నారు. అటువంటి విలువ లేని మనుషులు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు హర్షించరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమ్మ ఒడి, ఆసరా, వసతి దీవెన, విద్యా కానుకలు, చేయూత ఇలాంటి అనేక రకాల ప్రజాప్రయోజన సంక్షేమ పథకాలు అందడంతో ప్రజల ముందుకు ధైర్యంగా ఓట్లు అడగడానికి వస్తున్నామని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా దాచుకో దోచుకో అనే పద్ధతిలో తెలుగుదేశం నాయకులు వ్యవహరించారని అందువల్లనే గత ఎన్నికల్లో వారికి ప్రజలు ఇంటికి సాగనంపారని చెప్పారు. తనను మరోసారి శాసనసభ్యుడిగా అవకాశాన్ని ఇస్తే సమస్యలు అనే నగరంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చారు. సామాన్యుడి పాలన ఏ విధంగా ఉంటుందో ఐదేళ్ల కాలంలో చేసి చూపించానని అన్నారు. ద్వారకా నగర్ ప్రాంతంలో కోటి రూపాయలతో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో ప్రజలు హర్షించి తనకు అఖండ స్వాగతాన్ని పలికారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారికి అందుబాటులో అవసరమైన సేవలను అందిస్తున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారనాయుడు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, వైసిపి నాయకులు ఈశ్వర్ కౌశిక్, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, కేపీ రాజు, కోరాడ సూర్య ప్రభావతి, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ అభ్యర్థి మాధవిని భారీ మెజారిటీతో గెలిపించాలి : పతివాడ

విశాలాంధ్ర డెంకాడ: డెంకాడ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఆత్మీయ సమావేశం శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు అధ్యక్షతన జరిగింది. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా అందరినీ కలుపుకొని జనసేన పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో లోకం మాధవి ని మండలంలో 26 పంచాయితీల నాయకులుకు, కార్యకర్తలకు పరిచయం చేయడం జరిగింది. అనుభవం కలిగిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆద్వర్యంలో ముందుకు నడుస్తాం అని, మూడు పార్టీల వాళ్ళు కలిసి పని చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ బాయ్ బాయ్ బదుకొండ అనే నినాదంతో ముందుకు వెళ్ళి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గారిని గెలిపించాలని కోరారు. విజయనగరం పార్లమెంట్ సీటు తెలుగుదేశం పార్టీకి రావాలని కోరుకుందాం. లేని యెడల పొత్తులో భాగంగా బిజెపికి వెళ్ళిన అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి ఎంపీ సీటును కూడా గెలుచుకుందాం అని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు , నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, ఇచ్ఛాపురం నియోజకవర్గం అబ్జర్వర్ సువ్వాడ రవి శేఖర్ , డెంకాడ మండలం మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ , రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు , డెంకాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు , జనసేన నాయకులు లోకం ప్రసాద్ , విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు , రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు , విజయనగరం పార్లమెంటరీ అధికార ప్రతినిధి గేదల రాజారావు , మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి , స్వాక్స్ పర్సన్ లెంక అప్పలనాయుడు , యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన అదిబాబు, కొయనేని రమణ రాజప్పన్న చిల్ల పద్మ బంటుపల్లి రామానాయుడు, తుమ్మి లక్ష్మీరాజ్ , ముని పైడయ్య , చీకటి సుహాసిని , నల్లం శ్రీను, కొరాడ రామకృష్ణ , పిన్నింటి రాజారావు, దిండి రామారావు , తొత్తిడి సూర్య ప్రకాష్ , పైల శంకర్, బత్తల రామారావు, అట్టాడ ప్రమీల , తదితర నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై "సి.విజిల్" కొరడా..!

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

- పౌరులకు అందుబాటులో 'సి విజిల్' యాప్
- అందిన ఫిర్యాదుకు 100 నిమిషాల్లో చర్యలు

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే..సార్వత్రిక ఎన్నికల(2024)కు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు తీసుకునేలా..... ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిది.

'సి విజిల్' యాప్ అంటే ?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ 'సి విజిల్' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

యాప్ లో ఇలా రిజిస్టర్ చేసుకోవాలి

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి 'సి విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ సెల్ ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయొచ్చు...

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి కోడ్ ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి. వ్యక్తిగత ఫిర్యాదులు చేయడానికి అవకాశం లేదు.

ఫిర్యాదు ఇలా చేయాలి

మీ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను, లేదా 2 నిమిషాల వీడియో ను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

100 నిమిషాల్లో చర్యలు పూర్తి

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయండి

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే వారికి ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.... ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ బాధ్యతను నిర్వర్తించండి. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీరు కూడా భాగస్వాములు కండి.